# ఫీనిక్స్

రెక్కలు రెపరెపలాడిస్తూ ఎగురుతోంది ఫీనిక్స్. అది నిరంతరయానం. ఫీనిక్స్- విరామమెరుగని విహంగం.

ఒకే వేగంతో పయనిస్తోంది ఫీనిక్స్. సూర్యకిరణాల కాంతిలో మిలమిల మెరిసిపోతోంది. పెద్ద పెద్ద రెక్కలు చురుకైన కళ్ళు. నాలుగొందల తొంభై తొమ్మిది సంవత్సరాల పదకొండు నెలల ముప్పై రోజులుగా ఫీనిక్స్ ఆకాశయానం చేస్తూనే ఉంది. అదే ఆకాశం. అదే సూర్యుడు. అదే చంద్రుడు. అవే నక్షత్రాలు. అవే రాత్రులు, అవే పగళ్ళు. గమ్యం తెలియని అదే ప్రయాణం.

మూసిన కళ్ళు తెరిచాడు అనంతం. ఫీనిక్స్ కనిపించలేదు. మళ్ళీ పుస్తకంలో తలదూర్చాడు.

ఫీనిక్స్ అరుదైన పక్షి. దానిది అపురూపమైన అందం. గ్రీకు పురాణంలో...

అనంతం మళ్ళీ ఆగిపోయాడు. మధ్యన వేలుంచి, పుస్తకం మడిచి ఆలోచనలో పడ్డాడు.

ఫీనిక్స్- ఈ పేరు తనెప్పుడో విన్నాడు. ఏ సందర్భంలో?

గుర్తు రావడంలేదు.

అనంతం సన్నగా అయిదున్నర అడుగులుంటాడు. శరీరం ముడతలు పడింది. అతని కళ్ళు గాజుకళ్ళలా కాంతివిహీనంగా ఉన్నాయి. చేతులూ, కాళ్ళూ ఒంటి కంటించిన తోటకూర కాడల్లా ఉన్నాయి. తలమీద ఒక్క వెంట్రుక కూడా లేదు. వయసులో ఉన్నప్పుడు ఏ రంగో కానీ, ఇప్పుడు మాత్రం నల్లగా ఉన్నాడు వడలి పోయిన వంకాయలా.

కళ్ళు మూసుకుని ఆలోచిస్తున్నాడు అనంతం. ఫీనిక్స్ తనకు పరిచయం ఉన్న పేరు. కానీ, జ్ఞాపకం రావడంలేదు. ఇప్పటికీ జ్ఞాపక శక్తికి మందు కనుక్కోలేకపోయారు. ఎప్పటికి కనిపెడతారో?

కాలింగ్‌బెల్ మోగడంతో, అనంతం ఉలిక్కిపడ్డాడు. పక్కనే ఉన్న రిమోట్

కంట్రోల్ సిస్టమ్‌లోని ఓ బటన్ నొక్కాడు. వీధి తలుపు తెరుచుకుంది.

మనవడు, అతని భార్య లోపలికొచ్చారు. తలుపు దానంతట అదే మూసుకు పోయింది.

వాళ్ళిద్దరూ అనంతం వంక ఓసారి చూసి, చిన్నగా నవ్వి, తమ గదిలో కెళ్ళిపోయారు.

సాధారణంగా తెల్లారేవరకూ వాళ్ళు మళ్ళీ తనకు కనిపించరు. టీవీ చూస్తూనో, వీడియో సినిమాలు చూస్తూనో తమ గదిలోనే ఉండిపోతారు.

అనంతం నిట్టూర్చాడు.

మనవడికి పిల్లలున్నా బాగుండేది. తనకు కొంత కాలక్షేపం అయ్యేది. పిల్లలు త్వరగా కలగకుండా కొన్నాళ్ళు వాళ్ళేవో మందులు వాడారు. ఆ తరువాత పిల్లలు కావాలనుకున్నారు. కలగలేదు. టెస్ట్‌ట్యూబ్ బేబీకోసం వాళ్ళిప్పుడు డబ్బు కూడబెడుతున్నారు.

సిగరెట్ వెలిగించి, గట్టిగా దమ్ము లాగాడు అనంతం. హాయిగా అనిపించింది.

ఫీనిక్స్ గురించి మళ్ళీ ఆలోచించాడు. జ్ఞప్తికి రాలేదు. తన జ్ఞాపకశక్తి పూర్తిగా హరించి పోతోందా? భార్య ముఖాన్ని గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నించాడు. లాభం లేకపోయింది. విసుగ్గా లేచి, గదిలో కొద్దిసేపు పచార్లు చేశాడు. నిలువుటద్దం ముందు ఆగి, తన నీడ చూసుకున్నాడు. తను తనకే అసహ్యంగా కనిపిస్తున్నాడు. దిగులుగా, తిరిగి మంచంమీద కూర్చున్నాడు.

అతనికి ఏం చేయడానికీ తోచడంలేదు. పుస్తకం చదవబుద్ధి వేయడంలేదు. బయటకు వెళ్ళి వద్దామా అంటే శీతాకాలపు చలి తను భరించలేడు. కొద్దిసేపు అలానే మౌనంగా కూర్చుని లేచాడు. మళ్ళీ కూర్చున్నాడు.

'రిమోట్ కంట్రోల్‌లోని ఓ బటన్ నొక్కాడు. మంచానికి పది అడుగుల దూరంలో ఉన్న అల్మారా తలుపు తెరుచుకుంది. మరో బటన్ నొక్కాడు. అల్మారాలోని ఆల్బమ్‌ను ఓ స్టీలు చెయ్యి పట్టుకుని, ముందుకు సాగుతూ అనంతం దగ్గరకొచ్చింది. అనంతం ఆల్బం అందుకుని, మరో బటన్ నొక్కాడు. స్టీల్ చెయ్యి అల్మారా దగ్గరకు ముడుచుకుంటూ వెళ్లిపోయింది.

అనంతం ఆల్బంలోని ఒక ఫోటో చూడసాగేడు.

నలభై ఏళ్ళ పార్వతమ్మ బిగుసుకుపోయి చూస్తోంది. ఫోటోలో కంటే

మామూలప్పుడే అమె అందంగా ఉండేది. ముప్పై ఏళ్ళు సంసారం చేసినా ఆ బిగుసుకుపోవడం తగ్గలేదు. ఎన్నో సుఖదుఃఖాలు చవిచూశారు. దుఃఖాలన్నిటికీ మూలం అర్థిక (దు)స్థితి. చేసిన గుమాస్తా ఉద్యోగం అర్థిక సుఖాల సంగతి సరే, వెసులుబాటైనా అందించలేదు.

ఆ అసంతృప్తి తనలో కంటే పార్వతిలోనే ఎక్కువగా ఉండేది. అయినా ఆమె గయ్యాళి కాలేదు.

పండగొస్తే ఓ మంచి చీర కొనమనేది. కొన్నప్పుడు కొన్నాడు. లేనప్పుడు లేదు. చిరుకోపాలను ప్రదర్శించేది. పార్వతికి ఒక్కసారే తనమీద పెద్ద కోపం వచ్చింది. మాటామాటా అనుకున్నారు. తమ మధ్య అంత అఖాతం ఉందని అప్పటిదాకా తనకు తెలీదు.

అంతవరకూ- ఏళ్ళకు ఏళ్ళు బతకాలనే వాంఛ తనకంతగా ఉందనీ తెలీదు. చావంటే అందరికి లాగే తనకూ కొంత భయం ఉండేది. చావు లేకుండా ఉంటే బావుండునని అప్పుడప్పుడూ అనుకునేవాడు.

చచ్చిపోయినా మళ్ళీ బతకొచ్చని ఓ మిత్రుడు చెప్పినప్పుడు తను మొదట ఆశ్చర్యపోయాడు. తరువాత ఆశపడ్డాడు.

మిత్రుడు చెప్పిన ఆ సంస్థలో చేరాలంటే పదిహేను వేలు కట్టాలి. సరిగ్గా ఆ సమయంలోనే గ్రాట్యుటీ డబ్బు చేతికొచ్చింది. వచ్చిన పదిహేను వేలూ కట్టబోతుంటే "మీ కేమన్నా పిచ్చా, వెర్రా" అంటూ మొదటిసారి పార్వతి ఎదురు తిరిగింది.

తను అమె మాట వినలేదు. డబ్బు కట్టేసి ఆ సంస్థలో సభ్యునిగా చేరాడు. తను చేసిన పని భార్యకే కాదు, కొడుక్కీ నచ్చలేదు.

అన్నట్లు ఆ సంస్థ పేరేమిటి?

అనంతం మళ్ళీ అలోచనలో పడ్డాడు. కొద్ది సేపటికి గుర్తొచ్చింది. అతని ముఖంలో చిర్నవ్వు మొలిచింది.

క్రియోనిక్స్... క్రియోనిక్స్ సొసైటీ.

ఆ సొసైటీవల్లే- చచ్చిపోయిన తను మళ్ళీ బతికాడు. ఒక్కసారి కాదు, రెండుసార్లు!

క్రియోనిక్స్... క్రియోనిక్స్ సొసైటీ... క్రియోనిక్స్... అలానే మననం చేసుకుంటూ అనంతం గోడమీది కేలండర్ వంక చూశాడు.

2049వ సంవత్సరం, అక్టోబర్ 15.

అంటే తనకిప్పుడు 126 ఏళ్ళు!

క్రియోనిక్స్... ఫీనిక్స్... ఫీనిక్స్... క్రియోనిక్స్...

ఆ... అవునంతే. అనంతానికి ఫీనిక్స్ గురించి గుర్తొచ్చి, చాలా ఆనందం కలిగింది.

క్రియోనిక్స్ సొసైటీ చిహ్నాం- ఫీనిక్స్.

☆ ☆ ☆

క్రియోనిక్స్ సొసైటీ 1978లో ఏర్పడింది. అనంతం అదే సంవత్సరారంభంలో తన ఏభై అయిదో ఏట రిటైరయ్యాడు. క్రియోనిక్స్ సొసైటీ గురించి కొంత ప్రచారం జరిగింది.

వైద్యశాస్త్ర పురోగతి భవిష్యత్తులో ఏ వ్యాధినైనా నయం చేసే దశకు చేరుకుంటుంది. ఒక వ్యక్తి ఏ వ్యాధితోనైతే మరణిస్తాడో, ఆ వ్యాధిని నయం చేసే మందును కనిపట్టేవరకూ ఆ వ్యక్తి మృతదేహాన్ని భద్రపరిస్తే, తిరిగి అతన్ని బతికించవచ్చు- ఈ సిద్ధాంతంతో క్రియోనిక్స్ సొసైటీ ఏర్పడింది.

చాలామంది క్రియోనిక్స్‌ను నమ్మలేదు. ఆ సొసైటీ సిద్ధాంతాన్ని కాకమ్మకథగా కొట్టిపారేశారు. కొందరు బోగస్ సంస్థేమోనని అనుమానించారు. మరికొందరు డబ్బు కట్టడానికి వెనుకాడారు. ఇంకొందరు డబ్బు లేక ఊరుకున్నారు.

అనంతంలాంటి అతి తక్కువమంది ధైర్యంచేసి క్రియోనిక్స్ సొసైటీలో చేరారు. చేరిన వెంటనే అనంతం- తను చనిపోయినప్పుడు తనను దహనం చేయవద్దనీ, చనిపోయిన ఉత్తరక్షణం తన దేహాన్ని క్రియోనిక్స్ సొసైటీకి అప్పగించమనీ భార్యకూ, కొడుక్కీ గట్టిగా చెప్పాడు.

క్రియోనిక్స్ సొసైటీలో చేరిన పదిహేనేళ్ళకు- 1993లో అనంతం తన డెబ్బయ్యవ ఏట కేన్సర్ వ్యాధితో చనిపోయాడు. పార్వతమ్మ భర్త కోరికను తోసి పారెయ్యలేక సొసైటీకి అతని మృతదేహాన్ని అప్పగించింది.

అనంతం మృతదేహాన్ని క్రియోనిక్స్ సొసైటీ వాళ్ళు లేబొరేటరీకి తీసుకెళ్ళారు. సిరల ద్వారా మృతదేహంలోకి కొన్ని రసాయనాలను ఇంజెక్ట్ చేశారు. తరువాత, మృతదేహాన్ని చల్లబరిచి గాలి చొరని శవపేటికలో పెట్టారు. ఓ నెల రోజుల తరువాత అనంతం మృతదేహాన్ని నైట్రోజన్ ద్రవం నింపిన 321 డిగ్రీల శీతల పేటికలో

పదిలపర్చి, పది అడుగుల పొడవాటి 'కేప్సూల్'లో ఉంచారు. ఆ కేప్సూల్‌కు అప్పుడప్పుడూ నైట్రోజన్ ద్రవాన్ని సరఫరా చేస్తూ వచ్చారు.

అసలు క్రియోనిక్స్ సొసైటీని 1968లో అమెరికాకు చెందిన రాబర్ట్ దిటింగర్ ఏర్పాటు చేశాడు. మానవ రేతస్సు, రక్తం, టిష్యూలను భద్రపరిచే బాంకుల్లాగే మానవ మృతదేహాలనూ భద్రపరిస్తే, అప్పటికి లేని కొత్త ఔషధాలనూ, కొత్త చికిత్సా ప్రక్రియలనూ కనుగొన్న తరువాత ఆ మృతదేహాలను తిరిగి బతికించవచ్చని అతను భావించాడు. తరవాత్తరవాత క్రియోనిక్స్ సొసైటీ బ్రాంచీలు ఇతర దేశాల్లో కూడా ఏర్పడ్డాయి.

అనంతం మరణించిన ఏడేళ్ళకు కేన్సర్‌ను పూర్తిగా నయం చేసే ఔషధం కనుగొన్నారు. క్రియోనిక్స్ సొసైటీవారు అనంతం మృతదేహానికి చికిత్స చేయించారు.

అంతే. అనంతం 2,000 సంవత్సరంలో మళ్ళీ బతికాడు.

☆ ☆ ☆

బతికొచ్చిన అనంతాన్ని చూసి అతన్ని తెలుసున్న వారు ఎంతో ఆశ్చర్యపోయారు. ఇంటికొచ్చిన తండ్రిని కొడుకు ప్రేమగానే ఆహ్వానించాడు.

మొదట్లో కొంతకాలం అనంతానికి అంతా అయోమయంగా ఉండేది. కొత్త రాజకీయాలు, కొత్త నిర్మాణాలు, కొత్త టెక్నాలజీ, కొత్త భావాలు, కొత్త ప్రపంచం.

పార్వతమ్మ అప్పటికి అయిదేళ్ళ క్రితమే మరణించిందని తెలిసి అనంతం కొంతగానే దుఃఖించాడు. కొంతకాలానికి ఆ బాధను కూడా మరిచిపోయాడు.

ఓ ఆర్నెల్లకు ఇంట్లోకి మనవడొచ్చాడు. బయట తెలుసున్న వాళ్ళతో కాలక్షేపం. ఇంట్లో కొడుకు, కోడలితో కబుర్లు. మనవణ్ణి ఆడించడం- ఇలా అనంతానికి రోజులు బాగానే దొర్లాయి.

మనవడు పెద్దయ్యాక స్కూలు పుస్తకాలకు అంకితమవడంతో అనంతానికి కాలక్షేపం కరువైంది.

ఆఫీసు ఫైళ్ళతోనే అనేక సంవత్సరాలు గడిపిన అనంతం పొద్దుపుచ్చడంకోసం పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్నాడు. నెమ్మది నెమ్మదిగా అది వ్యసనంగా మారింది.

అనంతం చచ్చి బతికిన తరువాత, క్రియోనిక్స్ సభ్యత్వ రుసుం రెట్టింపయ్యింది. అయినా, స్తోమత ఉన్నవాళ్ళు చాలామంది చేరారు.

"మీరూ చేరండి" అని అనంతం చాలామంది పరిచయస్తులకు చెప్పాడు. కొడుక్కీ చెప్పాడు.

"మరి మీ కోడలూ, మనవడో?" అన్నాడు కొడుకు.

అనంతం వెంటనే జవాబు చెప్పలేకపోయాడు. కొన్ని క్షణాల తర్వాత "వాళ్ళనూ చేర్పించు" అన్నాడు.

"అంత డబ్బుంటే అందరం చేరేవాళ్ళమే. మనం ఇంకా అద్దె ఇంట్లోనే ఉంటున్నాం. మనకో ఇల్లు సమకూర్చడానికి సరదాలు చంపుకుని డబ్బు కూడబెడుతున్నాను. పరుగెత్తే ధరల్ని నా నిలవలు ఎంతకూ అందుకోలేకపోతున్నాయి. ఇంకా నాన్చితే లాభంలేదని వచ్చే నెల్లోనే ఇంటి పని మొదలెట్టాలని నిశ్చయించాను' ' అని వివరంగా చెప్పాడు కొడుకు.

అనంతం మారు మాట్లాడలేకపోయాడు.

తనకీ, కొడుక్కీ ఎంత తేడా?

తన తప్పును ఇంటి పని జరిగే కాలంలో సరిదిద్దుకునే ప్రయత్నం చేశాడు అనంతం. పొద్దుటే సైట్‌కి వెళ్ళి కూర్చునేవాడు. కొడుకు క్యారేజీ తెస్తే అక్కడే భోంచేసేవాడు. అలా ఓ సంవత్సరం తనూ, తన కొడుకూ శ్రమపడ్డాక తామంతా కొత్త ఇంట్లోకి మారారు. కొడుకు సంతోషానికి అంతులేదు.

కొత్త ఇంట్లో పుస్తకాలు- సినిమాలు- కబుర్లు- పాటలు- ఇలా సంవత్సరాల తరబడి అనంతం బతుకుబండి లాగించాడు. చూపు మందగించింది. రెండోసారి కంటి ఆపరేషన్ చేయించుకున్నాడు.

2021వ సంవత్సరంలో అనంతం మెదడులోని రక్తనాళాలు చిట్లి రెండోసారి మరణించాడు. క్రియోనిక్స్ సొసైటీకి అతని మృతదేహాన్ని అప్పగించారు. ఆరేళ్ళపాటు అతని మృతదేహం క్రియోనిక్స్ లేబొరేటరీలో ఉండిపోయింది. అంతలో కృత్రిమ రక్తనాళాల సృష్టి జరిగింది.

2027వ సంవత్సరం చివరలో అనంతం మళ్ళీ బతికాడు.

అతను ఇంటికొచ్చేటప్పటికి కొడుకు లేడు. అప్పటికి రెండేళ్ళ క్రితమే కొడుకు చనిపోయాడని విని అతను తెగ ఏడ్చాడు. తన వాళ్ళ చావులను తలచుకుని దుఃఖించడానికే తాను మళ్ళీ మళ్ళీ బతుకుతున్నాడా అని అతనికి బాధ కలిగింది. అయినా బతుకుమీది తీపి ఇంకా ఏ కొంతో బతికే ఉంది. ఈసారి బాధను

మరవడానికి చాలాకాలం పట్టింది.

ఆ మరుపు శాశ్వతంకాదనీ, మెదడు పనిచేసినంతకాలం బాధల తలపులు హృదయపు తలుపుల్ని తడుతూనే ఉంటాయనీ తర్వాత్తర్వాత అనంతానికి అర్థమైంది.

ప్రభుత్వాలు మారాయి. నాయకులు మారారు. పార్టీలు మారాయి. సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కింది. ఇవన్నీ బోధపరుచుకోడానికి అనంతానికి కొంతకాలం పట్టింది.

ఎన్ని మారినా, ఎంత అభివృద్ధి జరిగినా పాత వ్యవస్థే కొనసాగడం వల్ల ఆకలి, దారిద్ర్యం అలానే ఉండిపోయాయి. మానవతా విలువలూ, మానవ సంబంధాలూ కొంత తగ్గినా కదిలే విశ్వరథచక్రాలకు అవే ఇరుసుగా ఉన్నాయి.

అనంతం కేలండర్ మీంచి దృష్టి మరల్చి గోడ గడియారం వంక చూశాడు. రాత్రి ఎనిమిదిన్నర గంటలయింది. రిమోట్ కంట్రోల్ సిస్టమ్‌లోని ఓ బటన్ నొక్కాడు. పోర్టబుల్ కలర్ టీవీలో అడ్వర్‌టైజ్‌మెంట్స్ వస్తున్నాయి. తరువాత పిల్లల కార్టూన్ కథలు మొదలయ్యాయి.

నెలల పిల్లవాడు మంచంమీద బోర్లా పడుకుని చూస్తున్నాడు. అంతలో వాళ్ళింటికి వాళ్ళమ్మ ఫ్రెండ్ వచ్చింది. ఆమెను ఎగాదిగా చూసి, ఆమె గుండెలమీదకు దృష్టి సారించి, "ఆంటీకి పాలు బాగా వున్నాయే" అన్నాడు టీవీ బాలుడు కిలకిల నవ్వుతూ.

ఆ వెంటనే మరో సన్నివేశం.

చిరు వెన్నెల. పన్నెండేళ్ళ కుర్రాడు నిక్కరు జేబుల్లో చేతులుంచుకుని రోడ్డుమీద స్టైయిల్‌గా నడుస్తున్నాడు. అంతలో "హెల్ప్ హెల్ప్" అన్న కేక వినిపించింది. కుర్రాడు గబుక్కున ఆగి, అటూ ఇటూ చూశాడు. ఎవరూ కనిపించలేదు. తలెత్తి పైకి చూశాడు. డాబామీద ఓ యువకుడు ఓ యువతిని బలాత్కరిస్తున్నాడు. ఆమె గింజుకుంటోంది.

కుర్రాడు ఇక ఆలస్యం చెయ్యలేదు. గోడమీంచి గబగబా నడిచి, డాబా ఎక్కేశాడు. 'హంగ్-హూ' ఫైట్ చేసి యువకుణ్ణి చితకబాదేశాడు. ఆ తరువా కుర్రాడు తన్నిన తాపుకి యువకుడు డాబామీంచి కిందపడి నేల కరిచేశాడు.

'హమ్మయ్యా' అని ఊపిరి పీల్చుకుంటూ యువతి కుర్రాడివంక కృతజ్ఞతగా చూసింది. కుర్రాడు నవ్వుతూ ఆమె ముందు కెళ్ళాడు. ఒక్క ఎగురు ఎగిరి ఆమె

నడుంకు తంటెం వేశాడు. ఓ చేయి ఆమె వక్షంమీద వేసి, 'హెల్ప్ హెల్ప్' అని ఆమె మళ్ళీ అరవడానికి అవకాశం ఇవ్వకుండా తన పెదాలతో ఆమె పెదాల్ని మూసేశాడు.

అనంతం చిరాకుపడిపోయి టీవీ ఆపేశాడు. మరీ అతిగా చూపిస్తున్నారను కున్నాడు. సెక్స్ విశ్వరూపం చూసి, వలువలూడిన విలువల్ని తలుచుకుని అతను దిగులుపడిపోయాడు. కడుపులో తిప్పినట్టయింది.

కాసేపటికి మనవడు, అతని భార్య అనంతం గదిలో కొచ్చారు.

"తాతగారూ, భోంచేద్దాం రండి" అంది మనవడి భార్య.

ముగ్గురూ డైనింగ్ టేబుల్ దగ్గరికెళ్ళారు. భోంచేస్తూ, తన ఆఫీసు విషయాలు చెబుతున్నాడు మనవడు. కొత్త ఏమీ లేదు. 'తను ఉద్యోగం చేసేటప్పుడూ అలాంటి అనుభవాలు ఎదురయ్యాయి' అనుకున్నాడు అనంతం. అదేదో సరికొత్త సమస్యగా చెప్పుకు వస్తున్నాడు మనవడు.

మనవణ్ణి నిరుత్సాహపర్చడం ఇష్టంలేక ఆసక్తిగా వింటున్నట్టు నటించాడు. భోజనాలయ్యాయి. అనంతం కుర్చీలోంచి లేచి, సోఫామీద కూర్చున్నాడు. పక్కన కూర్చుని ఆఫీసు సమస్యను ఇంకా చెబుతూనే ఉన్నాడు మనవడు. అతనెప్పుడోగానీ తనతో ఇంతసేపు మాట్లాడడు. అంతా విని తోచిన సలహా చెప్పాడు అనంతం.

ఆ మధ్య ఒకనాడు మనవడితో "క్రియోనిక్స్ సొసైటీలో చేరరాదా?" అని అడిగాడు అనంతం. మనవడు ఎందుకో పకపకా నవ్వాడు.

"టెస్ట్ ట్యూబ్ బేబీకోసం కూడబెడుతున్నాగా? ఇంకో పదివేలు సమకూరితే మా కోరిక తీరుతుంది" అంటూ చెప్పుకుపోయాడు తప్ప క్రియోనిక్స్ గురించి ఏమాత్రం ఆసక్తి చూపలేదు.

టీవీలో వార్తలు మొదలయ్యాయి.

క్యూబాకు చైనా ఆయుధాలు సరఫరా చేస్తుండడంవల్ల తనకు ప్రమాదం ముంచుకొస్తోందని అమెరికా ఐక్యరాజ్యసమితికి ఫిర్యాదు చేసింది. చైనా ఆయుధాలను తమ రక్షణకోసమే వినియోగిస్తాం తప్ప అమెరికాపై దాడిచేసే ఉద్దేశం లేదని క్యూబా ప్రకటించింది.

వార్త లవగానే తాతకు గుడ్‌నైట్ చెప్పి, తన గదిలోకి వెళ్ళిపోయాడు.

అనంతం టీవీ కట్టేసి, ఇందాక మధ్యలో ఆపేసిన పుస్తకాన్ని చదవడానికి తీశాడు.

ఫీనిక్స్ ఎగురుతోంది. అలసటలేని ప్రయాణం. గమ్యంలేని ప్రయాణం. ఎగరడమే లక్ష్యంగా ఫీనిక్స్ ఆకాశయానం చేస్తోంది. నదులు, కొండలు, అడవులు, ఎడారులు దాటుతూ ప్రయాణిస్తోంది. అంతలో దాని జ్ఞాననేత్రం తెరుచుకుంది. సుదీర్ఘయానంలో తనకు అయిదొందల సంవత్సరాలు నిండాయని దానికి తెలిసింది.

తెలిసిన మరుక్షణమే ఫీనిక్స్ నేలమీద కాలూనింది. ఆకాశం వంక చూసింది. అదే ఆకాశం. తన వంక చూసుకుంది. అదే ఫీనిక్స్.

ఫీనిక్స్ చితి పేర్చుకుంది.

మళ్ళీ పుట్టడంకోసం ఆ చితిలోకి దూకింది.

అకస్మాత్తుగా అనంతం మెదడుకి ఏదో తాకినట్టయింది. పుస్తకం మూసి ఆలోచనలో పడ్డాడు.

గది చుట్టూ చూశాడు. అదే గది. అదే టీవీ. అదే అల్మారా. అదే మంచం. కిటికీలోంచి బయటకు చూశాడు. అదే చీకటి. ఆకాశంలో మినుకు మినుకుమంటూ అవే నక్షత్రాలు.

అద్దంలో తనను చూసుకున్నాడు. అదే నిన్నటి, మొన్నటి మొహం- నల్లగా వడలిపోయిన వంకాయలా.

అయిదొందల సంవత్సరాలు జీవించిన ఫీనిక్స్ తన చితి తానే పేర్చుకుని చచ్చింది. దాని మరణం అసహజం. రెండుసార్లు చచ్చి బతికిన తన జీవనం సహజమా?

అసహజ మరణాల్లానే అసహజ జీవనాలూ అపసవ్యాలు కావా?

సహజత్వంలోని సౌందర్యం అసహజత్వంలో ఏ కోశానా ఉండదు. సహజ జీవనంలో ఉండే శక్తి సామర్థ్యాలూ, లక్ష్యాలూ, తపనలూ, వాటిని సాధించడంలో కలిగే సంతృప్తీ అసహజ జీవనంలో మృగ్యం.

ఇది తెలిసే కాబోలు తన సంతానం క్రియోనిక్స్‌లో చేరడానికి పెద్దగా ఆసక్తి చూపలేదు.

ఈ ఊహ వచ్చాక అనంతంలో అలజడి.

క్రియోనిక్స్‌లో చేరినవాళ్ళు మూడుసార్లు తిరిగి బతకవచ్చును. తను ఇప్పటికే రెండుసార్లు బతికాడు. మూడోసారి కూడా చచ్చి బతకవచ్చును. కానీ, మూడోసారి బతికి ఏంచెయ్యాలి? ఫీనిక్స్‌లాగే బతకాలి.

పోనీ జటాయువులా...

జటాయువు రెక్కలు టపటపలాడిస్తూ ఎగురుతోంది. కళ్ళలో సాహసపు మెరుపు, 'రక్షించండి, రక్షించండి' అన్న కేక విని, తల అటూ ఇటూ తిప్పి చూసింది. ఆపదలోనున్న సీతను ఆదుకోవడానికి అత్యంత వేగంతో వెళ్ళింది. మహాబల పరాక్రముడైన రావణాసురునితో యుద్ధంచేసి గెలవగలనా అనే సందేహం దానికి రాలేదు. చెడ్డను ఎదుర్కొని, మంచి చేయాలన్నదే లక్ష్యం. ఆ లక్ష్యమే దాని ధైర్యం. ముక్కుతో పొడిచి పొడిచి, కాలి గోళ్ళతో రక్కి రక్కి, రెక్కలతో చరిచి చరిచి, సీతను కాపాడడానికి శతవిధాల పోరాడి పోరాడి రెక్కలు తెగి నేలకొరిగిన జటాయువు చిరాయువు.

జటాయువులా జీవించే మనోశక్తి తనకు లేదు.

అనంతం తల విదిలించి, ఒక నిశ్చయానికొచ్చాడు.

"నా సభ్యత్వాన్ని రద్దు చెయ్యమని ఇప్పుడే క్రియోనిక్స్ సొసైటీకి ఫోన్ చెయ్యాలి" అనుకుంటూ రిసీవర్ ఎత్తి ఆ నంబరుకు డయల్ చేశాడు.

*(ఆంధ్రప్రభ వారపత్రిక, 2-3-1988)*